www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 21 మే 2023

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

ఎండు గడ్డి నిల్వలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

వర్షాకాలంలో గోదావరి నదికి రాబోయే వరదల నేపథ్యంలో లంక గ్రామాల పశువులకు ముందస్తు చర్యగా గడ్డి నిల్వలు ఏర్పాటు చేస్తున్నట్లు తహశీల్దార్ కె.సూర్యారావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 15 ఎకరాల ఎండు గడ్డిని చుట్టలుగా బాగు చేసి లంక గ్రామాలైన కేదార్లంక, వీధివారి లంక, నారాయణ లంక, అద్దంకివారి లంక, పల్లపు లంక, కోరిమిల్లి లంకలకు తరలించేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు వీటిని తరలిస్తున్నట్లు శనివారం తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి సిహెచ్.బాలాజీ, ఆర్ఐ, విఆర్ఒలు, రైతులు పాల్గొన్నారు.

ఎండుగడ్డిని చుట్టలుగా చుడుతున్న దృశ్యం

'ఉపాధి' చట్టానికి కేంద్రం తూట్లు

- రెండు పూటలా పనులతో కూలీల అవస్థలు
- పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-అమలాపురం

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇందుకు తాజాగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను పరిశీలిస్తే కేంద్రం ప్రభుత్వం ఉపాధి కూలీల పట్ల వ్యవహరిస్తున్న తీరే అందుకు నిదర్శనం. జిల్లాలో 2.23 లక్షల మందికి ఉపాధి హామీ జాబ్ కార్డ్స్ కలిగి ఉన్నారు. వీటిలో యాక్టివ్‌గా 2.20 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న కూలీల సంఖ్య అయితే 1లక్షా 48 వేలగా నమోదవుతోంది. జిల్లాలో 2023-24 సంవత్సరానికి 30 లక్షల పని దినాలు కల్పించాలని అధికారులు లక్ష్యం గా పెట్టుకున్నారు. ఏప్రిల్ నెల నుంచి ఇప్పుడు వరకు 12,89,832 రోజులు పని దినాలుకల్పించినట్లు అధికారులు చెబుతున్నారు. ఉపాధి కూలీల పట్ల ప్రభుత్వ తీరు దారుణంగా ఉందని ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీలకు పే స్లిప్పులు ఇవ్వకుండా బ్యాంకు ఖాతాలో ఎంత పడితే అంతే అనే విధంగా పరిస్థితి ఉందని అన్నారు. రెండు పూటలా పని విధానంతో వడదెబ్బకు కూలీలు విలవిలలాడుతున్నారు. ఉపాధి పనిలో రెండు పూటలా పనివిధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది. మొదటి ఫోటోకు, రెండో ఫోటోకు నాలుగు గంటల వ్యవధి ఉండాలన్న నిబంధనే అందుకు కారణం. ఇన్ని నిబంధనలు తెచ్చిన కేంద్ర ప్రభుత్వం కూలీలకు ప్రతిరోజూ ఎంతకూలీ వస్తుందో చెప్పే పే స్లిప్పులు మాత్రం ఇవ్వడం లేదు. గతంలో వారానికి ఒకరోజు ఉపాధి కూలీలకు పే స్లిప్పులు ఇచ్చేవారు. ఏరోజు ఎంత కూలిపడిందో అందులో స్పష్టంగా ఉండేది. కానీ ఇప్పుడు ఇవ్వడం లేదు. అదేమని అడిగితే కూలీల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేస్తాం కదా పే స్లిప్పులు ఎందుకని మాట్లాడుతున్నారు. ఉపాధి పందరోజుల హామీ పనుల్లో మాత్రం పని చేయడమే తప్ప రోజుకు వస్తుందో తెలియదు. గతంలో పే స్లిప్పుల ఆధారం కల్పించాలన్న ఎంతవుతుందంతో వివరాలు ఇచ్చే ప్రభుత్వం వాటిని నిలిపివేసింది. జిల్లాలో చాలా చోట్ల కూలీలు దాదాపు 4 వారాల నుం చి బిడిపాడి పనులు చేస్తున్నారు. కానీ ఇప్పటి వరకూ రెండు వారాల కూలి సొమ్ము మాత్రమే వారి ఖాతాల్లో జమయ్యాయి. పెండింగ్‌లో ఉన్న వేతనాలు కూడా వెంటనే చెల్లించాలని కోరుకుంటున్నారు.

పి. గన్నవరంలో పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

యర్ర పోతవరంలో ..

కనీస వసతుల కరువు

రామచంద్రపురం ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు కనీస వసతులు కరువయ్యాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల నుంచి 50 డిగ్రీల మధ్యలో నమోదు అవుతుండటంతో కూలీలు నానా ఇక్కట్లకు గురవుతున్నారు. గతంలో ఉపాధి హామీ పథకం కూలీలకు ఒక పూట మాత్రమే పని కల్పించేవారు ప్రస్తుతం రెండు పూటలు పనిచేయాలని నిబంధన విధించడంతో మండుటెండల్లో కూలీలు రెండు పూటలా పనులకు వెళ్లలేని పరిస్థితి. గతంలో కూలీలకు వేసవికాలంలో మజ్జిగ పంపిణీ, ఎండలో విశ్రమించేందుకు టెంట్లు, ఏదైనా ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచేవారు. గత ఏడాది నుంచి కూలీలకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పాలకులు రద్దు చేశారు. దీంతో కూలీలు కనీసం మంచినీళ్లు కావాలన్నా వాళ్లే తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక రోజువారీ వేతనం సాయంత్రం కూలీలకు చెల్లించే వేతనం రూ.272గా నిర్ణయించారు. రామచంద్రపురం మండలంలోని 20 గ్రామాల్లో ప్రతిరోజు 3500 మంది ఉపాధి హామీ చట్టం కింద కూలి పనులు నిర్వహిస్తున్నారు. వీరందరికీ ఈ ఏడాది రెండు లక్షల 50 వేల పని దినాలు కల్పిస్తున్నట్లు ఎపిఒ అరుణ తెలియజేశారు. మండలం మొత్తం 15700 జాబు కార్డు కలిగి ఉండగా అందులో 9600 కార్డులు యాక్టివ్‌గా గా ఉన్నట్లు మొత్తం అన్ని గ్రామాల్లో కలిపి 78 పనులు గుర్తించినట్లు ఆమె వివరించారు. కె.గంగవరం మండలంలో 26 గ్రామపంచాయతీలో 11,120 జాబు కార్డులు ఉండగా వాటిలో 6210 కార్డులు యాక్టివ్‌గా ఉన్నట్లు కె. గంగవరం మండల ఎపిఒ కాలా గణపతి వివరించారు. కనీస వసతులు ఏర్పాటు చేయాలని, ధరలు పెరుగుతున్న దృష్ట్యా కూలీ రేట్లు పెంచాలని వేసవికాలం కావ డంవల్ల పని గంటలు ఉదయం మాత్రమే కల్పించాలని, కూలీలకు టెంట్లు ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేయాలి కూలీలు కోరుతున్నారు.

సమ్మర్ అలవెన్స్ రద్దు చేయడం దారుణం

ఉద్యమాలు, పోరాటాలు చేసి వామపక్ష పార్టీల ఒత్తిడితో సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయడం కేంద్రానికి ఇష్టం లేదు. మార్చి, ఏప్రిల్, మే నెల ల్లో 30 శాతం సమ్మర్ అలవెన్స్ ఇచ్చేవారు. ఒక నొక సందర్భంగా 50 శాతం కూడా ఇచ్చారు. చట్టం ప్రారంభం అయినప్పటి నుంచి వున్న ఈ అలవెన్సును ఈ ఏడాది కేంద్రం కావాలనే రద్దు చేసింది. కూలీలకు గిట్టుబాటు కూలి రావడం లేదు.

-కారెం వెంకటేశ్వరరావు,
జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

రోజువారీ వేతనం పెంచాలి

ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం చెల్లిస్తున్న వేతనం సరిపోవడం లేదు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రభుత్వం ఉపాధి హామీ కూలీల వేతనాన్ని పెంచాలని కోరుకుంటున్నాము. రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండటంతో కూలీలు ఎండకు ఇబ్బందులు పడుతున్నాము.

-ఇనుకపట్ల మంగాదేవి,
అనాతవరం, అమలాపురం రూరల్

ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదు

గతంలో మాదిరిగా ఉపాధి హామీ చట్టంలో భాగంగా కూలీలకు ఇచ్చే మజ్జిగ ఇవ్వడానికి, కూలీలు సేద తీరేందుకు ఏర్పాటు చేసే టెంట్లకు నిధులను ప్రభుత్వం ఇవ్వడం లేదు. అందువల్ల వాటిని నిలిపివేశాం. అదేవిధంగా ప్రథమ చికిత్స కిట్లు కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం వల్ల వాటిని ఏర్పాటు చేయటం సాధ్యం కాదని 'ప్రజాశక్తి' ఈ సందర్భంగా తెలిపారు.

-పి.అరుణ, ఎపిఒ, రామచంద్రపురం

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలపై నిర్వహణపై జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సమన్వయ కమిటీ సభ్యులతో సమీక్షించారు. శనివారం ఉదయం అమలాపురం కలెక్టరేట్ లో సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సమన్వయ కమిటీ సభ్యులను కోరారు. మే 24 నుంచి జూన్ 1 వరకు ఇంటర్ పబ్లిక్ అడ్వాన్సుడ్ సప్లమెంటరీ థియరీ పరీక్షలు రెండు సెషన్స్ లో నిర్వహిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి 5:30 గంటల వరకు ఇంటర్ రెండవ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో వివిధ కారణాల చేత హాజరు కాలేకపోయినా లేదా ఫెయిల్ అయిన విద్యార్థులకు జూన్ 2 న ఎథిక్స్ పరీక్ష, జూన్ 3 న పర్యావరణ పరీక్ష లు నిర్వహిస్తామన్నారు. జూన్ 5 నుంచి జూన్ 9 వరకు ఫెయిల్ అయిన విద్యార్థులకు రెండు సెషన్లలో రాజమహేంద్రవరం గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో జనరల్ మరియు ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. జిల్లా లో 27 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మొదటి రెండవ సంవత్సరం కలిపి మొత్తం 14257 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఈ పరీక్షలని నిర్వహణ, పర్యవేక్షించడానికి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా పరీక్ష కమిటీ ఏర్పాటు చేయబడిందన్నారు. రాజమహేంద్రవరం రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలిగిన కంట్రోల్ రూమ్ నెంబర్ 0883-2473430 కి ఫోన్‌లో సంప్రదించవచ్చన్నారు. జిల్లాలో ఐదు సిట్టింగ్ స్క్వాడ్లు నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశామన్నారు. 27 పరీక్ష కేంద్రాలలో బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు అయ్యేలా చూడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పరీక్షలు సీసీ కెమెరాల నిఘాలో జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాలో సెల్ ఫోన్ అనుమతి లేదన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పి శ్రీధర్, జిల్లా జెసి ధ్యాన్‌చంద్ర హెచ్ ఎం, డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబు, ఆర్‌డిఒ వసంత రాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి సారించిందనిజిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. శనివారం అమలాపురం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ముమ్మడివరం అర్బన్, ముమ్మిడివరం రూరల్ మండలాల గ్రామ వార్డు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు డిజిటల్ అసిస్టెంట్లు తో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచికలకు సంబంధించి క్షేత్రస్థాయి లో ఉన్న వ్యత్యాసాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అందుకోవాలంటే క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన డేటా అవసరమన్నారు. డేటా అందుబాటులో ఉంటేనే ప్రభుత్వాలు దానికి తగ్గ పాలసీలు చేయగలవని తద్వారా లక్ష్యాలను త్వరితగతిన అందుకోగలమన్నారు. జిల్లాలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచికల కు సంబంధించి వివిధ శాఖల వద్ద ఉన్న సమాచారంలో వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. 6 నుంచి 19 సంవత్సరాల వయసుగల బాలికల సమచారం, గర్భిణుల సమాచారం, 5 సంవత్సరముల లోపు ఉన్న పిల్లల సమాచారం వివిధ శాఖల వద్ద భిన్నంగా ఉన్నాయని, జిల్లాను ఆరోగ్య వంతంగా మార్చేందుకు విద్యా, ఆరోగ్యం, సంక్షేమం, ఐసిడిఎస్ శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకమన్నారు. 0-5 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఆధార్ నమోదు చేసుకునేలా వారి తల్లిదండ్రులను ప్రోత్సహించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గ్రామ వార్డు సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు డిజిటల్ అసిస్టెంట్లు వాలంటీర్ల సహాయంతో ఖచ్చితమైన డేటా సేకరించడం ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచికలలో వ్యత్యాసాలు తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి భీమేశ్వర్, ముమ్మిడివరం ఎంపిడిఒ ఎఎన్.శ్రీనివాస్, ఉమ్మడివరం మున్సిపల్ కమిషనర్ జి లోవరాజు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అముజూరులో పిడుగు పడి దగ్ధమవుతున్నచెట్లు

పలుచోట్ల భారీవర్షం

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట ఈదురుగాలులలతోకూడిన భారీ వర్షం శనివారం కురిసింది. దీంతో పలుచోట్ల పిడుగులు పడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. **మండపేట** మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి వాతావరణం చల్లబడింది. భారీ వర్ష కారణంగా రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షానికి విద్యుత్ విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. **ఆత్రేయపురం** మండలంలోని గ్రామాలలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది దీంతో పల్లపు ప్రాంతాలను జలమయ్యాయి. కళ్లాల్లో ధాన్యపురాశులు అక్కడక్కడ తడిసి ముద్దయ్యాయి వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మొక్కల్లోతు వర్షం నీరు చేరడంతో యాత్రికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు **రామచంద్రపురం** కె.గంగవరం మండలంలో అముజూరు గ్రామ ంలో పిడుగులు పడి రెండు కొబ్బరి చెట్లు దగ్ధం అయ్యాయి. ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది.

కార్టూ'నిజం'

ఈసారి గైర్హాజరుకు కారణం..
కంట్లో నలక పడి అనీజీగా ఉందట సార్..!!

బిఎస్‌సి ఎలక్ట్రానిక్స్ ఫలితాల్లో దీప్తి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -మామిడికుదురు

ఎపి ఉన్నత విద్యా మండలి నూతనంగా ప్రవేశపెట్టిన ఆంగ్లమధ్యమం విద్యా విధానంలో.. తొలి బ్యాచ్ కు చెందిన మూడో సెమిస్టరు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డివివి.సత్యనారాయణ శనివారం చెప్పారు. ఆదికవి నన్నయ విద్యాలయం శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో తమ విద్యార్థులు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే అగ్ర స్థానంలో నిలిచారన్నారు. అంతేకాకుండా బిఎస్‌సి ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు ఉమ్మడి తూర్పు గోదావరిలోనే అత్యుత్తమంగా 95.45 శాతంతో ఉత్తీర్ణత సాధించారన్నారు. బిఎస్‌సి(ఎంపిసిఎస్) విభాగానికి చెందిన , ఎమ్.తేజస్వి, ఎమ్ఇపిఎస్ విద్యార్థినిలు నార్ని వందన లీలా దుర్గ, గూటం దివ్య 9.8 గ్రేడ్ పాయింట్లు సాధించారన్నారు. బిఎస్‌సి ఎంపిసిఎస్ విద్యార్థులు మొల్లేటి తేజస్వి, బొలిశెట్టి ఈశ్వరి దుర్గ 9.7 గ్రేడ్ పాయింట్లు, నల్లి అక్షిత, కడలి రాజశ్రీ 9.6గ్రేడ్ పాయింట్లు సాధించారన్నారు.

విద్యార్థినులతో కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ

జి.దుర్గానాగశ్రీ, జి.వై.వి.సత్య, కె. రోహిణి, కట్టా శివ కుమార్ 9.5, ఎడిడి.భవాని, కె.కె.సింధు 9.4గ్రేడ్ లతో పాటుగా మరో 15 మంది 9గ్రేడ్ పాయింట్లు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులను,ఉత్తమ ఫలితాల సాధనకు కషి చేసిన అధ్యాపకులకు ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మోకా రంగారావు, వాసంశెట్టి నాగరాజు, కోడూరి వెంకటేష్, యాలంగి రవికుమార్, డాక్టర్ వైవిఎస్.ప్రసాద్, బి.సజన, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ఎ1 సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజోలు

టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాలును పురస్కరించుకుని రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎ1 సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం, రక్త దాన శిబిరం ఎ1 సేవా సమితి వ్యవస్థాపకులు చెల్లు బోయిన శ్రీనివాస్ ఆర్థిక సహకరంతో ఏర్పాటుచేశారు. ఈ వైద్య శిబిరాన్ని టిడిని అమలాపురం పార్లమెంటరీ ఇంచార్జి గంటి హరీష్ మాదూర్, మాజీ డిప్యూటీ స్పీకర్ ఎవి.సూర్య నారాయణ రాజు ప్రారంభించారు. తొలుత ఎన్‌టిఆర్ పుట్టిన రోజు కేక్ ను కట్ చేసి అభిమానులకు పంచారు. అమలాపురం కిమ్స్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్, కిమ్స్ వైద్య కళాశాల సిబ్బంది వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. యువకులు పాల్గొని రక్త దానం చేశారు. కార్యక్రమంలో టిడిపి మాజీ జిల్లా ఉపాధ్యక్షులు భూపతి రాజు సాయిబాబు రాజు వర్మ, మాజీ ఎఎంసి ఛైర్మెన్లు దొమ్మేటి ఉమా మహేశ్వర రావు, కాండ్రేగుల సత్యనారాయణ, రాజోలు, తాటిపాక, విశ్వేశరాయపురం సర్పంచ్‌లు రేవు జ్యోతి, కోటిపల్లి రత్న మాల, హెలీనా, టిడిపి నాయకుల ఎ1 సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజోల్లో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న గంటి హరీష్

ఘనంగా జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- రామచంద్ర పురం

సినీ నటుడు జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ద్రాక్షారామలో ఎన్‌టిఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సాదే రాజేష్ కుమార్, గౌరవ అధ్యక్షులు వాసంశెట్టి శ్యామ్ కుమార్ మాట్లాడుతూ జూనియర్ ఎన్‌టిఆర్ 40 వ పుట్టినరోజు సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశామన్నారు. అనంతరం ద్రాక్షారామ బోస్ బొమ్మ సెంటర్లో అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ సేవా సమితి గౌరవ అధ్యక్షులు వాసంశెట్టి శ్రీనివాస్ కుమార్(శ్యామ్), అధ్యక్షులు సాదే రాజేష్ కుమార్, సెక్రెటరీ శీలం మణికంఠ, వైస్ ప్రెసిడెంట్ శివ, చంద్రశేఖర్, జాయింట్ సెక్రెటరీ క్రాంతి కుమార్, సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

క్రీడాకారులకు సాత్విక్ సాయిరాజ్ ఆదర్శనీయం

ప్రజాశక్తి-అమలాపురం

బ్యాడ్మింటన్ పతకాలు సాధిస్తున్న సాత్విక్ సాయిరాజ్ క్రీడాకారులకు, విద్యార్థులకు ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. గత నెల 30 న దుబాయ్‌లో జరిగిన ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ లో పురుషుల డబుల్స్‌లో చిరాగ్ శెట్టితో కలిసి బంగారు పతకాన్ని సాధించిన సాత్విక్ సాయిరాజ్‌ను, ఆయన తండ్రి కాశీ విశ్వనాథ్‌ను శనివారం అమలాపురం కలెక్టరేట్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాత్విక్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన వ్యక్తి కావడంలో తనకెంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఘనమైన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాత్విక్ సాయిరాజ్ కలెక్టర్‌కు ఒక టోపీని బహుమతిగా ఇచ్చారు. ఇదే కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి డాక్టర్ పిఎస్.శర్మ కూడా రెడ్ క్రాస్ తరఫున సాత్విక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డిఆర్ఒ సిహెచ్ సత్తిబాబు, రెడ్ క్రాస్ మెంబర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాత్విక్ సాయిరాజ్ సన్మానిస్తున్న దృశ్యం

వాలంటీర్ల సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-కొత్తపేట

సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకువెళ్లడంలో వాలంటీర్ల పాత్ర ఎనలేనిదని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేట గ్రామంలో జరిగిన ఉత్తమ సేవలు అందించిన వాలంటీర్లకు సన్మానం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు ఎటువంటి సిఫార్సులు అవసరం లేకుండా వైసిపి ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను ప్రజలకు , అందిస్తున్న వాలంటీర్లను సన్మానించడం అదష్టంగా భావిస్తున్నానని అన్నారు. అర్హత ఉన్న అందరికీ సంక్షేమ పథకాలు గ్రామవాలంటీర్లు అందిస్తున్నారని అన్నారు. గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్తుంటే వాలంటీర్ల సేవలు బాగా చేస్తున్నారని ప్రజలు కొనియాడుతున్నారని అన్నారు. కొత్తపేట మండలంలో 385 మంది వాలంటీర్లకు సేవామిత్ర, 5 గురు వాలంటీర్లకు సేవారత్న అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలతో ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి

ప్రజాభిప్రాయ సేకరణ పత్రాల ప్రదర్శన

ప్రజాశక్తి-మామిడికుదురు

ఇదేం కర్మ కార్యక్రమం ద్వారా రాజోలు నియోజకవర్గ అరవై గ్రామాల ప్రజల నుండి సేకరించిన ప్రజాభిప్రాయ సేకరణ పత్రాలను మామిడికుదురు లో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు శనివారం ప్రదర్శించారు. అనంతరం ప్రత్యేక వాహనం లో అమలాపురం పార్లమెంట్ కార్యాలయానికి తరలించ్చారు. ప్రత్యేక వాహనాన్ని రాజోలు మండల పార్టీ అధ్యక్షులు జెండా ఊపి ప్రారంభించారు. మాజీ జెడ్‌పి ఛైర్మన్ నామన రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి మాట్లాడుతూ అరవై గ్రామాలలో సుమారుగా 47,767 గహాలు, 1,91,069 ఓటర్లు ఉన్నారని ఇందులో 35 వేల గృహాలను సందర్శించి సుమారు 1,40, 000 మంది ఓటర్లను కలసి ప్రతీ కుటుంబం నుండి ఒక్కరి చొప్పున ప్రజాభిప్రాయాన్ని సేకరించామన్నారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో వైసిపి ప్రభుత్వ అసమర్థ పాలనలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని మాజీమంత్రి గొల్లపల్లి అన్నారు. రాష్ట్ర ప్రజలు నిత్యావసర వస్తువుల ధరలతో బాటు, విద్యుత్తు బిల్లులు, ఆర్ టీ సి చార్జీలు, గ్యాస్ ధరలు, మద్యం ధరలు, ఎరువులు, పురుగు మందులు, గహ నిర్మాణ సామగ్రి ధరలు విపరీతంగా పెరగడంతో ఆంధ్రప్రదేశ్ లో సామాన్యుడి బ్రతుకు భారంగా మారిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మంగెన భూదేవి, ఎంపిపి కేతా శ్రీనివాస్, మొల్లేటి శ్రీనివాస్, వర్ధినీడి బాబ్జి, చాగంటి స్వామి, బోనం బాబు, సాగి పాపయ్యరాజు, సాగి బాబ్జిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురులో పత్రాలను ప్రదర్శిస్తున్న టిడిపి నాయకులు

మడికిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

పలుచోట్ల మజ్జిగ చలివేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల శనివారం మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటుచేశారు. **ఆలమూరు** సిఎం జగన్ అభిమాని ఆకుల ప్రసాదరావు తన పుట్టినరోజును పురస్కరించుకొని జాతీయ రహదారి మడికి సెంటర్ వద్ద శనివారం చల్లని మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి బాటసారులకు దాహాన్ని తీర్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి సభ్యుడు మల్లిపూడి ఉదయ భాస్కరరావు, వైసిపి నేతలు యణమదల నాగేశ్వరరావు, చెల్లబోయిన శ్రీనివాస్, యు.సుందర్ విజ యం తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** మండలంలోని అంగరలో శనివారం మజ్జిగ చలివేంద్రం వస్త్ర వర్తక సంఘం ఆధ్వర్యంలో ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ చలివేంద్రాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పైపులైన్లకు మరమ్మతులు

ప్రజాశక్తి-మండపేట

నీటి వృథాను అరికట్టడంలో భాగంగా ఏడిద గ్రామ శివారు కొత్తూరులో పైపులైన్‌లకు శనివారం మరమ్మతులు చేపట్టారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను నేపథ్యంలో మరమ్మతులు చేపట్టామని కార్యదర్శి యు.వీర్రాజు అన్నారు. జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా అర్హులందరికీ ఇంటింటికి కుళాయి అందజేశామన్నారు.

వెంకటశర్వన్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

పోలీసెట్‌లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-మండపేట

పోలిసెట్‌లో మండపేటకు చెందిన విద్యార్థి డి. వెంకటశర్వన్ ప్రతిభ కనబరిచి 120కి 120 మార్కులు సాధించాడు. విద్యార్థి తండ్రి డి.త్రిమూర్తులు ప్రభుత్వపాఠశాల ఉపాధ్యాయుడు. తల్లి సాయిసుధ గహిణి. ఈ సందర్భంగా వెంకటశర్వన్ మాట్లాడుతూ ఐఐటి సాధించి, కంప్యూటర్ ఇంజనీరు కావాలన్నదే తన లక్ష్యం తెలిపాడు.

నేరాలు ఘోరాలు

అచ్చంపేట ఎడిబి రోడ్‌లో ఢీకొన్న టిప్పర్ లారీలు

రెండు టిప్పర్ లారీలు ఢీకొని డ్రైవర్లకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం అచ్చంపేట ఎడిబి రోడ్ లోని ఉండూరు సెంటర్ వద్ద శనివారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు టిప్పర్ లారీలు బలంగా ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లకు తీవ్ర గాయా లయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు వివరాల ప్రకారం ఉన్నట్టుండి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడడంతో ఎదురెదురుగా వెళుతున్న వాహ నాలు అదుపుతప్పి ఢీ కొట్టుకోవడంతో ఈ ప్రమాదం సంభవించినట్టు పోలీసులు చెప్పారు. ప్రమాదంలో ఒక టిప్పర్ డ్రైవర్‌కు కాలు విరిగిపోగా మరో టిప్పర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి ఇద్దరిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా సామర్లకోట - కాకినాడ మెయిన్ రోడ్డుతో పాటు సామర్లకోట - అచ్చంపేట బైపాస్ రోడ్‌లోనూ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సామర్లకోట ట్రాఫిక్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీ శక్తి నిధులు స్వాహా చేసిన నిందితునిపై చర్యలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

శ్రీ శక్తి నిధుల స్వాహా చేసిన నిందితునిపై చర్యలు తీసుకుంటామని జిల్లా డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ వియస్‌యస్.ప్రసాద్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ క్లస్టర్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ముమ్మిడివరానికి చెందిన దుర్గాప్రసాద్ శ్రీ శక్తి మేనేజర్, ఎపిఎ లాగిన్లు వినియోగించి శ్రీ శక్తి నిధులు రూ.14 లక్షలు స్వాహా చేసినట్లు తెలిపారు ఆత్రేయపురం మండలంలోని మెర్లపాలెం గ్రామంలో వినియోగంలో లేని నాలుగు డ్వాక్రా గ్రూపులను ఎంచుకుని వారి పేరుమీద ఉన్నతాధికారులకు తెలియకుండా రూ.14లక్షలు రుణం మంజూరు చేశారన్నారు. ఆ మొత్తాన్ని దుర్గాప్రసాద్ కి చెందిన మూడు అకౌంట్లకు, సోదరి పేరున ఉన్న బ్యాంక్ అకౌంటుకు రూ.3,75,000 వంతున ఫండ్స్ బదిలీ చేసి స్వాహా చేశాడన్నారు. అయితే తీసుకున్న రుణానికి ఈ నెల వాయిదా సొమ్ము చెల్లించకపోవడంతో ఈ అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చిందన్నారు. దీంతో ఆలస్యంగా నిధులు స్వాహా అంశాన్ని గుర్తించిన ప్రాజెక్ట్ డైరెక్టర్ ఈ ఘటనపై విచారణ జరిపారు దుర్గాప్రసాద్ స్వాహా చేసిన రూ.14 లక్షలె రికవరీ చేశామన్నారు. నిధులు స్వాహా పాల్పడిన దుర్గాప్రసాద్ పై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల గ్రామంలో తాడేపల్లిగూడెం రోడ్డులోని సుబ్రహ్మణ్యేశ్వర, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల వెనుక భాగంలో నల్ల ఎర్ర చెరువు లో తేలియాడుతున్న మహిళ మృతదేహం పోలీసులకు లభ్యమైంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. బహిర్భూమికి వెళ్లిన ఓ వ్యక్తి సమాచారం మేరకు చెరువులో మహిళ మృతదేహం ఘటన వెలుగు లోకి వచ్చింది. పోలీసులు స్థానికుల సహకారంతో మహిళ మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించారు. అనంతరం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో ఇటుక బట్టీ కార్మికుని గల్లంతు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కేదార్లంకలో ఇటుక బట్టి కార్మికుడు శుక్రవారం గోదావరి నదిలో గల్లంతయ్యాడు. అంగర ఎస్ఐ టిఎస్.రంగారావు శనివారం తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం కోరా పుట్ జిల్లా నారాయణ పటక్ చెందిన తంగిడి సోబనా కేదార్లంకలోని పోలిశెట్టి గణేష్ కు చెందిన ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. రెండు నెలల క్రితం పనిలో చేరిన సోబనా శుక్రవారం గోదావరిలో దిగి గల్లంతయ్యాడు. సంఘటన ప్రాంతాన్ని మండపేట సిఐ శివ గణేష్ పర్యవేక్షణలో మండపేట రూరల్ ఇన్‌ఛార్జి ఎస్ఐ శివప్రసాద్ పరిశీలించి వివరాలు నమోదు చేశారు. విఆర్ఒ టి. వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు అంగర ఎఎస్ఐ రంగారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గజత గాళ్ళతో గాలింపులు చర్యలు చేపట్టినప్పటికీ శనివారం సాయంత్రం వరకు సోబనా మతదేహం లభ్యం కాలేదు.

కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఆత్రేయపురం

ప్రమాదవశాత్తూ కాలువలో పడిపోయిన వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన లొల్ల లాకులు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాడిపూడి గ్రామానికి చెందిన గుంటూరి లక్ష్మీపతి రాజు శుక్రవారం రాత్రి సమయంలో లాకులు సమీపంలో బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి కాలువలో పడి మతి చెందాడు. దీనిపై ఎస్ఐ సిహెచ్.సుధాకర్ కేసు నమోదు చేసి మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం గోదావరి ఏటి గట్టున శనివారం మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్‌చేశామని ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ కె.వీరబాబు శనివారం తెలిపారు. వివరాలు ఇవి.. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన సింగులూరి కష్ణ ప్రసాద్ యానాం నుంచి ఏటి గట్టు మీదుగా మోటార్ సైకిల్ పై మద్యం తరలిస్తుండగా అతనిని అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి 25 మద్యం బాటిల్ ను, మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నాని ఎన్‌డిపిఎల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ డి.శ్రీనివాసరావు, ఎస్.సత్యనారాయణ, ఇ. పవన్ కుమార్‌లు పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఆర్ఎఒ సమక్షంలో ప్రజల నుండి పాత వస్తువులు స్వీకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పాత వస్తువుల సేకరణ

ప్రజాశక్తి - యానాం

యానాంలో ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా శనివారం "నా జీవితము...నా స్వచ్ఛ ప్రదేశము" అనే ఆర్ఎఒ మునిస్వామి శనివారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యానాం ప్రజల నుండి పాత సామగ్రి, పాత పుస్తకములు, పాత ఆట వస్తువులు, ప్లాస్టిక్, పాత బట్టలు స్థానిక యానాం బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఉన్న కమ్యూనిటీ హాల్‌లో ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఖండవల్లి రామకృష్ణ, ఎఇ మేడిశెట్టి రామలింగేశ్వరరావు, చెల్లి గోపీనాథ్, హెచ్‌ఆర్ స్క్వేర్ ఇన్‌చార్జ్ నామా రాజు, ఆనంద్, పెట్టా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

లయన్స్ క్లబ్ పిల్లారాయ యానాం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పులవర్తి శ్రీను శనివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్ ప్రాంగణంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్యశిబిరంలో బీపీ, సుగర్, ఎముకలు, ప్రసూతి, చెవి, ముక్కు, గొంతు, గుండె సంబంధిత వ్యాధులకు వైద్యం అందిస్తారన్నారు. శిబిరాన్ని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రారంభిస్తారని తెలిపారు.

22న తాగునీటికి అంతరాయం

యానాం టౌన్ వాటర్ వర్క్స్‌లో నిర్వహణ పనులు జరుగుతున్న కారణంగా ఈ నెల 22వ తేదీ సోమవారం సాయంత్రం పూట మెట్టకూరు, గోపాల్ నగర్, అంబేద్కర్ నగర్, కురసంపేట గ్రామాలలో తాగునీటికి అంతరాయం ఏర్పడు తుందని, వినియోగదారులు సహకరించాలని ప్రజా పనుల శాఖ అసిస్టెంట్ ఇంజనీరు శనివారం ప్రకటనలో తెలిపారు. ఇల్లు నిర్మించుటకు, కార్లు, రోడ్లు, పశువులు కడుగుటకు మంచినీటిని ఉపయోగించరాదని కోరారు.

వ్యాయామం లేకుంటే కీళ్ల నొప్పులు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రముఖ ఎముకల వైద్య నిపు ణులు డాక్టర్ బొండా సూర్యారావు తెలిపారు. సర్పవరం జంక్షన్ బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ. వ్యాయామం చేయకపోతే మెడ, కీళ్ల నొప్పులు వచ్చే అవకాశం ఉందన్నారు. 40 ఏళ్లు దాటిన వారికి వృత్తి, శ్రమను బట్టి కీళ్ల బాధలు ప్రారంభమవుతాయని అన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీనగేష్, రాఘవరావు పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపండి

ప్రజాశక్తి - కాకినాడరూరల్

బడి ఈడు పిల్లలను పనుల్లోకి పంపకుండా పాఠశాలలో చేర్పించాలని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ పిలుపునిచ్చారు. సర్పవరం జంక్షన్ బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలలకు కూడా అనేక హక్కులు ఉన్నా వాటిని తీర్చమని డిమాండ్ చేయలేరు. పెద్దలు వారి సురక్షితంగా ఉంచేలా బాధ్యత వహించాలన్నారు. వారిని పనుల్లోకి పంపకుండా పాఠశాలలో చేర్పించాలని అన్నారు. నూతన విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ కాన్వెంట్లలో కూడా పేద విద్యార్థులకు ఉచితంగా విద్య పొందే అవకాశం ఉందని పట్నాయక్ తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాజా, రాఘవరావు పాల్గొన్నారు.

పొలిటికల్ 'హీట్'

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో రాజకీయ పరిణామాలు వేడెక్కాయి. వేసవి ఎండలతో పోటీ పడుతున్నాయి. జగనన్న విద్యాకానుక కార్యక్రమం ప్రారంభంలో భాగంగా ఈ నెల 24న కొవ్వూరులో జరగబోయే కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరువుతున్న విషయం విదితమే. సభను విజయవంతం చేసేందుకు ఆ పార్టీ శ్రేణులు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. అధికార యంత్రాంగం ఏర్పాట్ల పరిశీలనలో తలమునకలవుతోంది. మరో వైపు ఈ నెలాఖరున 27, 28 తేదీలలో జిల్లాలో మహానాడు కార్యక్రమం జరగనుంది. రెండో రోజు జరిగే మహాసభకు సుమారు 15 లక్షల మంది వస్తారని తెదేపా ముఖ్యనేతలు అంచనా వేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలలో భాగంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజా సమీకరణ చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల ముఖ్యనేతల రాక నేపథ్యంలో సందడి వాతావరణం నెలకొంది. అకాల వర్షాల కారణంగా జిల్లాలో నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు టిడిపి అధినేత చంద్రబాబు జిల్లాలో నిర్వహించిన పర్యటనకు విశేష స్పందన లభించింది. దీంతో ప్రభుత్వ యంత్రాంగం క్షేత్రస్థాయికి వెళ్లి ధాన్యం కొనుగోలుకు ఉపక్రమించటంతో కొంత ఊరట లభించింది. అయితే పూర్తిగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించలేదు. అకాల వర్షాల అనంతరం తొలిసారిగా జిల్లాకు ముఖ్యమంత్రి రాక ప్రత్యేకత సంతరిం చుకుంది. భరోసా కల్పిస్తారా..? అనే ఆశతో జిల్లా రైతాంగం ఎదురుచూస్తోంది.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై వ్యవసాయ కార్మికులు కన్నెర్ర

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై వ్యవసాయ కార్మికులు చేపట్టిన పోరాటం విజయవతంగా కొనసాగుతోంది. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకానికి నిధుల కోత, మెటీరియల్ కాంపొనెంట్ ఖర్చులకు కేటాయింపులు పెంపు, అవినీతికి చెక్ పెడతామంటూ 'ఎన్ఐసి' పేరుతో నూతన సాఫ్ట్‌వేర్ అమల్లోకి తీసుకు రావడంతో ఈ పథకానికి నూతన విధానాల ఫలితంగా కార్మికులు పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలను కోల్పోయారు. దీనిపై వామపక్ష పార్టీలు రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి పిలుపునిచ్చి కూలీలకు అండగా నిలిచాయి. పని ప్రదేశాలలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకోవటంతో పాటు కార్మికుల ద్వారా ఉన్నతాధికారులకు సమస్యలపై విజ్ఞప్తి చేస్తున్నాయి. ఈ వారంలో కర్నాటక అసెంబ్లీ ఫలితాలు విడుదలయ్యాయి. గత వారం వారకూ అధికారంలో ఉన్న బిజెపి ఘోరంగా ఓటమి పాలవడానికి ఆ పార్టీ అనుసరిస్తున్న ఆర్థిక, సామాజిక వినాశకర విధానాలే కారణమని ప్రజాస్వామ్య వాదులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బిజెపి ఇప్పటికైనా ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకోకుంటే దేశవ్యాప్తంగా కర్నాటక ఫలితాలే పునరావృతం అవుతాయని హెచ్చరిస్తున్నారు. తాజా ఫలితాలతో జిల్లా బిజెపి పార్టీలోనూ అంతర్మధనం మొదలైనట్లు తెలుస్తోంది.

వ్యవసాయ రంగంపై 'వైసిపి' సవతి తల్లి ప్రేమ

రైతు ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం వ్యవసాయ రంగంపై సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని జిల్లా రైతాంగం అభిప్రాయ పడుతోంది. గోదావరి నదీ పరివాహక ప్రాంతం కావాటంతో జిల్లాలో అత్యధిక ప్రాంతాలలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. బహుళార్ధక సాధక ప్రాజెక్టు అయిన పోలవరం పూర్తి చేస్తామంటూ ఇప్పటికి రెండు వాయిదాలు వేసింది. జాతీయ ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి స్థాయి నిధులు కేటాయించాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీని ప్రశ్నించలేని అసమర్ధతను వైసిపి ఆత్మవిమర్శ చేసుకోవాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రతిఏటా వేసవి పనులు నిర్వహించి కాల్వల ఆధునీకరణ, తూటు కాట తొలగింపు, గోదావరి డ్రెడ్జింగ్ నిర్వహించటం దశాబ్దాల కాలంగా ఆనయవాయితీగా వస్తోంది. ఈ ఏడాది డ్రెడ్జింగ్ పనులు, పంట కాల్వల పూడిక తీత పనులు రాష్ట్ర ప్రభుత్వం అటకెక్కిం చేసినట్లు తెలుస్తోంది. కేవలం తూటుకాడ తొలగింపునకు రూ.17 కోట్లు కేటాయించి చేతులు దులుపుకోవటంతో జిల్లా రైతాంగంతో పాటు జలవనరుల శాఖ సిబ్బంది సైతం అయోమయ పరిస్థితిలో ఉన్నారు. వ్యవసాయ రంగంలో కీలకమైన నీటి వనరులు నిల్వ చేసుకోవాలనే ముదుచూపు లేకపోవటం విమర్శలకు దారితీస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కాల్వల ఆధునికీకరణ చేపట్టాలని రైతాంగం కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఠారెత్తిస్తున్న ఎండలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మధ్యాహ్నానికి వేడి గాల్పులు ఊపందు కోవటంతో ప్రధాన కూడళ్లు సైతం నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. రాజమహేంద్రవరం, కాకినాడ వంటి ముఖ్య పట్టణాలలో 49 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పట్టణాలలో రోజువారీ కూలీలు, చిరువ్యాపారులు, పల్లెల్లో ఉపాధి కార్మికులు ఎండలోనే పనులు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు అనధికార విద్యుత్ కోతలు గోరుచుట్టుపై రోకలి పోటులా మారాయి. రాత్రి వేళల్లో విద్యుత్ అంతరాయాలు విధించటంతో ఉమ్మదీత, ఉక్కపోతతో ప్రజలు అవస్థలుపడుతున్నారు. పాలనా యంత్రాంగం ఇప్పటికైనా చొరవ చూపి అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా అందించాలని ప్రజలు కోరుతున్నారు.

గోదారి గలగలలు

చోరీ కేసుల్లో ఏడుగురు అరెస్టు

రూ.17.5 లక్షల విలువైన 12 మోటార్ సైకిళ్లు, 30 లారీ బ్యాటరీలు స్వాధీనం

నేర వివరాలు వివరిస్తున్న ఎస్‌పి సతీష్‌కుమార్

ప్రజాశక్తి - కాకినాడ క్రైమ్

ఎవరైనా దొంగ సరుకు కొనుగోలు చేసినట్లయితే దొంగతనం చేసిన నేరస్థులతో పాటు కొనుగోలు చేసిన వ్యక్తి కూడా సమాన శిక్షార్హుడు అవుతాడని ఎస్పి ఎస్.సతీష్ హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పి సతీష్ కుమార్ చోరీకి సంబంధించి వివరాలను వెల్లడించారు. కాకినాడ నగరంలో మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నేరస్తులను అదుపులోకి తీసుకుని వారు వద్ద నుండి 15 లక్షల విలువైన 12 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.కాకినాడ సంజయ్ నగర్‌కు చెందిన దమ్ము శివప్రసాద్ (శివ), ములపర్తి కిషోర్ (బాబీ), గుండారపు శివరాం (సాయి)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. అలాగే రోడ్డు పక్కన నిలుపుదల చేసిన లారీల నుండి బ్యాటరీలను చోరీ చేస్తున్న మరో ముఠాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుండి రెండు లక్షల 50 వేలు విలువైన 30 బ్యాటరీలను స్వాధీనం చేసుకుని వాటిని దొంగిలించిన స్థానిక దుమ్ముల పేటకు చెందిన కోమటి నూకరాజు, వంక ప్రేమ్ కుమార్‌లను అరెస్టు చేసినట్లు ఎస్‌పి సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనం చేసి తెచ్చిన బైకులు, బంగారం, వగైరా వస్తువులు ఎవరూ కూడా కొనుగోలు చేయవద్దని ఆయన సూచించారు. దొంగ వస్తువులు కొనుగోలు చేసినా, కలిగి ఉన్నా నేరస్థుడిగానే పరిగణించి జైలుకు పంపి స్తామని హెచ్చరించారు. దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తుల సమాచారాన్ని ప్రజలు పోలీసులకు అందించాలని తెలిపారు. తమ మోటారు సైకిళ్లకు ప్రతి ఒక్కరూ వీల్ లాక్కుని వేసుకోవాలని, జిపిఎస్‌ను కూడా ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌పి సూచించారు. ఈ కేసులో నిందితులను పట్టుకోవడంలో విశేష కృషి కనబరిచిన క్రైమ్ సిబ్బందికి ఎస్‌పిఅభినందనలు తెలిపారు. సమావేశంలో ఎఎస్‌పి పి.శ్రీనివాస్, క్రైమ్ డిఎస్‌పి ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

తూనికలు కొలతలపై వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్ మోహన్

తూనికలు, కొలతల మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి - పెద్దాపురం

వినియోగదారులు తూనికలు, కొలతల్లో జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉంటూ వాటిని తెలుసుకోవడం ద్వారానే న్యాయం పొందగలుగుతారని తూని కలు, కొలతల ఇన్‌స్పెక్టర్ వి.మోహన్ అన్నారు. శనివారం స్థానిక తూనికలు, కొలతల కార్యాలయంలో ప్రపంచ తూనికలు, కొలతల దినోత్సవం సంద ర్భంగా వినియోగదారుల సంఘం అధ్యక్షులు బళ్లమూడి సూర్య నారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన తూనికలు, కొలతల్లో, పెట్రోల్ బంకుల్లో ఏ విధంగా మోసపోతుంటారో ఆయన డిస్‌ప్లే ద్వారా వివరించారు. వ్యాపారస్తులు తమ వేయింగ్ మిషన్ వినియోగ దారులకు కనిపించేలా ఉంచాలన్నారు. సదస్సులో వినియోగదారుల సంఘం కార్యదర్శి ఎం భాస్కర్ రావు,డి శేఖర్,టి గణేష్,కె సుధాకర్, కెవివి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వానరం దూకడంతో తెగి పడిన విద్యుత్ తీగ

- గంటన్నరపాటు ఆగిన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఒక వానరం విద్యుత్‌లైన్‌పై దూకడంతో విద్యుత్ తీగ తెగిపడిన సంఘటనతో విశాఖపట్నం నుండి విజయవాడకు వెళ్లే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ శనివారం సాయంత్రం గంటన్నర పాటు సామర్లకోట రైల్వే స్టేషన్ శివారులో నిలిచిపోయింది. రైలు నడిచేందుకు ప్రధాన ఇంధనం అయిన విద్యుత్ వైరు తెగిపోవడంతో సమస్య ఏర్పడి రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ కు అంతరాయం ఏర్పడింది. దీంతో విశాఖపట్నం విజయవాడ మధ్యలో నడిచే పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని సామర్లకోట రైల్వేస్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళుతున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ సామర్లకోట రైల్వే స్టేషన్‌ను వదిలిపెట్టిన తర్వాత హుస్సేన్‌పురం వద్ద గల వెంకటరామా ఆయిల్ మిల్లు వద్ద ఒకకోతి విద్యుత్ లైన్ పైకి దూకడంతో విద్యుత్ వైరు కున్న జాయింట్ కనెక్షన్ వైరు తెగిపోయి రైలు అక్కడి కక్కడే నిలిచిపోయింది. లోపాన్ని గుర్తించిన రైల్వే అధికారులు సీనియర్ సెక్షన్ ఇన్‌చార్జ్ (ఓహెచ్చి) అప్పారావు ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన తెగిన విద్యుత్తు లైనుకు మరమ్మతులు చేపట్టారు. మరమ్మత్తులకు సుమారు గంట 35 నిమిషాలు సమయం పట్టింది.

విద్యుత్ లైనుకు మరమ్మతులు చేపడుతున్న రైల్వే సిబ్బంది

సమస్యకు కారణమైన వానరం

మరమ్మతులు పూర్తి చేసిన తదుపరి రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ విజయవాడ వైపు పంపించారు. ఈ అంతరాయం వల్ల ప్రయాణికులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే అంతరాయానికి కారణమైన కోతికి ఎలాంటి ప్రమాదానికి గురికాకపోవడం కొసమెరుపు.

ఆదిత్యలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విద్య ప్రాంగణంలో గల వివిధ కళాశాలలలో విద్యనభ్యసిస్తున్న వివిధ దేశాలకు చెందిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్, జింబాబ్వే స్కాలర్‌షిప్ విభాగం అధ్యక్షులు మాన్యాంగ్ ఫినియాస్, డైరెక్టర్ ఆఫ్ స్కాలర్ షిప్స్ టిండై, సౌత్ సుడాన్ ఎంబసి సెక్రటరీ జిబెని యూన్నెస్ అముమ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ ఎం.ఎస్.రెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ ఆదిత్య ఇంటర్నేషనల్ ప్రమాణాలతో క్వాలిటీ విద్యను అందిస్తూ దేశ విదేశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మన్ననలు పొందుతోందన్నారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ల్యాబ్, లైబ్రరీ, హాస్టల్ కాంటీన్ వసతులుగల ఆదిత్యలో మరింత మంది విద్యార్థులు చేరేలా ఉత్తమ ఫలితాలు సాధించేలా తమవంతు సహ కారం అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అంద జేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో క్యాంపస్‌లోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆదిరెడ్డి రమేష్, డోలా సంజయ్, కె.రవిశంకర్, ఇంటర్నేషనల్

గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విదేశీ విద్యార్థులు, విదేశీ డైరెక్టర్లు

రిలేషన్స్ డైరెక్టర్ పరంజీత్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ విద్యార్థులు నిర్వహించిన పాటల పోటీలు, డాన్స్ పోటీలు, ఫ్యాషన్ షో, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో బంగ్లాదేశ్, కాంగో, లెసోతో, మజాంబిక్యూ, నేపాల్, యుగాండా, సౌత్ సుడాన్, సుడాన్, జాంబియా, జింబాబ్వే దేశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆద్యంతం తెలుగు ప్రొఫెసర్ నీలిమ యాంకరింగ్‌తో ఎంతో ఉత్సాహంగా సాగింది.

స్టాక్‌పాయింట్‌కు చేరిన పాఠ్యపుస్తకాలు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక గౌతమి మున్సిపల్ హైస్కూల్లోని జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్ కు పాఠ్యపుస్తకాలు వచ్చాయి. ఈ స్టాక్ పాయింట్‌ను ఎంఇఒ నాయుడు రామచంద్రరావు, మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఎంఇఒ మాట్లాడుతూఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు ప్రణాళిక బద్ధంగా జగనన్న విద్యా కానుక అందించాలన్న లక్ష్యంతో మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఎయిడెడ్ స్కూల్ తో కలిపి 69 పాఠశాలలోని విద్యార్థులకు (3409 బాలురు, 3596 బాలికలు) 7005 జగనన్న విద్యా కానుక అవసరమన్నారు. ఇందులో భాగంగా 4563 బెల్టులు, యూనిఫామ్ తో పాటు ఒకటో తరగతి విద్యార్థులకు బొమ్మలతో కూడిన డిక్షనరీ, ఆరవ తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, 6 నుంచి 10 తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలు ప్రభుత్వం అందిం చనుందన్నారు. ప్రస్తుతం 45 వేల పాఠ్యపుస్తకాలు, షూస్ స్టాక్ పాయింట్ కి వచ్చాయన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసన

ప్రజాశక్తి-కొత్తపేట

పేదలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలపై ప్రతిపక్ష నేత చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కొత్తపేటలో ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు నిరసన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిర్ల మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది లబ్ధిదారులకు వైసిపి ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చిందన్నారు. దీంతోపాటు ఇళ్ళు నిర్మించే కార్యక్రమంలో భాగంగా...అమరావతిలో 50వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పేదలను కించపరిచేలా టిడిపి నేత చంద్రబాబు చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలను ప్రజలతో పాటూ వైసిపి ఖండిస్తోందన్నారు. సిఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజ్, ఎంపిపి మార్గాన గంగాధర్, జెడ్‌పిటిసి సభ్యుడు గూడపాటి రమాదేవి, మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, కొత్తపేట పిఎసిఎస్ అధ్యక్షులు ముసునూరి వెంకటేశ్వరరావు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కుక్కల లెక్కింపునకు సర్వే

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని కుక్కల నియంత్రణకు తొలుత నగరంలో ఎన్ని కుక్కలు ఉన్నాయన్న విషయంపై శనివారం కుక్కల లెక్కింపు సర్వే నిర్వహించారు. కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్. మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లలోనూ తెల్లవారుజామున 3.30 నుంచి 6 గంటల వరకు ఈ లెక్కింపు ప్రక్రియ కొనసాగించారు. ఆయా సచివాలయ కార్యదర్శి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతోపాటు నలుగురు వాలంటీర్లు పాల్గొన్నారు. పశు సంవర్ధకశాఖకు చెందిన వైద్యులు, ఇతర సిబ్బంది సమన్వయంతో ప్రతీ సచివాలయ పరిధిలో సర్వే నిర్వహించారు. కమిషనర్ మహేష్‌కుమార్ ఉదయం 3.30 నుంచి నగరంలో జగన్నాథపురం, చర్చిస్క్వేర్ సెంటర్, ఆర్‌టిఒ కార్యాలయం ప్రాంతాల్లో ఆయన సర్వే విధానాన్ని తనిఖీ చేశారు. ఎడిసి సీహెచ్ నాగనరసింహ రావు, నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ పృధ్వీచరణ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సర్వే అనంతరం కుక్కల నియంత్రణపై కార్యాచరణను సిద్ధం చేస్తామని కమిషనర్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ జెడి సూర్యప్రకాశరావు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

IN THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION-I, AT: VISAKHAPATNAM
C.C.191/2020
Between:
A.Ravi Prasad (Died) & 2 others ...Complainants
And:
The Managing Director,
Sahara Credit Co-operative Society Limited & 3 others ...Opposite Parties
NOTICE
To,
Opposite Party No.2:
The Regional Manager,
Sahara Credit Co-operative Society Limited,
Nagamallithota Junction, Kakinada,
East Godavari District.
The above named complainants has filed CC No.191/2020 against the opposite party to **Rs.23,70,929/-** with interest, the date of maturity of bond for non-payment of maturity of bond amount, damages for deficiency in service and cost of litigation and you are shown as 2nd opposite party to the proceedings. Please take notice that, the above matter is posted to **06-06-2023** for your appearance before the Hon'ble District Consumer Disputes Redressal Commission-I, VUDA Complex, Siripuram, Visakhapatnam at **10:30 A.M.**, either yourself in person or by authorized person, failing which the Hon'ble Commission will be proceed with the matter as per law.
S. SREE RAMA MURTHY, Advocate
Visakhapatnam, (Andhra Pradesh)
Cell: 9849633707.

విత్తన గుళికల తయారీపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని గొల్లలగుంటలో విత్తన గుళికలు తయారీపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ప్రకతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో రైతులలో సామూహికంగా విత్తన గుళికలు తయారు చేయించారు. విత్తన గుళికలు తయారీకి అనుములు, కందులు, మినుములు, పెసలు, జొన్నలు, సజ్జలు, అలసందలు, మొక్కజొన్న, పప్పు శనగ, గోరుచిక్కుడు, చిక్కుడు, గోంగూర, ఉలవలు, బఠాణీలు, బీర, నేతి బీర, సొర, గుమ్మడి, బూడిదగుమ్మడి, పుచ్చ, బెండ, పిల్లి పెసర, కుసుమలు, పొద్దుతిరుగుడు, అవిశ, జీలుగ, జనుము, కాకర, వెల్వెట్ బీన్స్, ఫ్రెంచి బీన్స్ అవసరమన్నారు. ఇవి నాటడం ద్వారా భూమి సారవంతం అవుతుందని సిబ్బంది రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో కె.గౌరీ, పడాల రాజేష్, డి.ఉమాదేవి, డి.లోవలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కొత్తపేట

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు మండలంలో కొత్తపేట గ్రామంలో 5 వ సచివాలయ పరిధిలోని రామారావుపేట, బోరుసు వారి సావరం, శీలం వారి పాలెం ప్రాంతాలలో శనివారం ఆయన గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వంలో అందిన సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పథకాలతో పేదలకు లబ్ధి

ఉప్పలగుప్తం వైసిపి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధిచేకూరుతుందనిరాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారురు. సరిపల్లిలో గడప.. గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, ఎంపిటిసి సభ్యుడు కొంకి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE. NARASARAOPET. PALNADU Dist.
OS. NO. 192/2018, I.A NO.202/2022.
BETWEEN:-
అడ్డా రమాదేవి. ....పిటిషనర్.
AND
జక్కా వీరాంజమ్మ మరియు ఇతరులు....రెస్పాండెంట్స్.
పై నెంబర్ పిటిషన్ నందు R.4 అయిన కొంపెర్ల కోటేశ్వరమ్మ చనిపోయినది. కావున సదరు I.A నెం.లో వారి పిల్లలను చేర్చి ఉన్నాము. సదరు I.A నెం.లో R.11 అయిన కంపెర్ల రమేష్ చంద్ర ఆదిత్యకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినసూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున కోర్టు వారి ఉత్తర్వులు మేరకు సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. ది.15-06-2023 వ తేదీకి వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా తేదీన ఉదయం 10:30 ని.లకు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ శ్రీ కోర్టు ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలువుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
R11) కొంపెర్ల రమేష్ చంద్ర ఆదిత్య, S/o సత్యనారాయణ (లేట్) D.No. 3-144, వేలంపేట్, తురంగి పోస్ట్, కాకినాడ,తూర్పుగోదావరి జిల్లా.
శ్రీకోర్టు వారి ఉత్తర్వులు మేరకు.
వాయిదా ది. 15-06-2023.
ఇట్లు.
పి చక్రపాణి,పిటిషనర్, తరపు న్యాయవాది,
కేబీఆర్ కాంప్లెక్స్, స్టేషన్ రోడ్,
నరసరావుపేట, పల్నాడు జిల్లా,
Cell.No. 9885644203.